ఈనాడు
epaper.eenadu.net

# నిర్మించుకోండి.. ఆకాశ నడక మార్గాలు

- వాణిజ్య భవనాలు, నివాస సముదాయాలకు అవకాశం
- స్కైవాక్‌ల ఏర్పాటుకు ముందుకొస్తున్న ప్రైవేటు సంస్థలు
- మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ సమస్యతో పాటు కాలుష్యాన్ని తగ్గించేలా ప్రైవేటు వాహనాల సంఖ్యను తగ్గించడానికి ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా మెట్రో స్టేషన్ల నుంచి వాటి సమీపంలోని వాణిజ్య భవనాలు, నివాస సముదాయాలకు ఆకాశ నడక మార్గాలు (స్కైవాక్) నిర్మాణాలను ప్రోత్సహించాలని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌లు ఇటీవల జరిగిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్రణాళిక సమావేశంలో నిర్ణయించారు. ఈ వివరాలను మెట్రోరైలు సంస్థ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.



ఉప్పల్‌లో వలయాకారంలో స్కైవాక్

### ఇప్పటికే అందుబాటులో..

పంజాగుట్ట, హైటెక్‌సిటీ, ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ల నుంచి సమీపంలోని మాల్స్‌కు ఇప్పటికే ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ స్కైవాక్‌లను నిర్మించింది. జేబీఎస్, పరేడ్ గ్రౌండ్స్ స్టేషన్లను కలుపుతూ రహదారి దాటే అవసరం లేకుండా అందుబాటులోకి తీసుకొచ్చారు. సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ నుంచి సమీపంలోని రేతిఫైల్ బస్టాండ్, రైల్వే స్టేషన్ చేరుకునేలా స్కైవాక్ ఉంది. ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు అనుసంధానంగా కూడలిలో వలయాకారంలో ఆకాశ నడక మార్గాన్ని హెచ్ఎండీఏ నిర్మించింది.

### ప్రతి స్టేషన్ పాదచారుల వంతెనే

మెట్రో మొదటి దశలోని 69.2 కి.మీ. మార్గంలోని మొత్తం 57 మెట్రో స్టేషన్లలో...ప్రతి స్టేషన్ నుంచి రహదారికి ఒకవైపు నుంచి మరోవైపునకు చేరుకునేందుకు అవకాశం ఉందని ప్రయాణికులే కాదు.. ఇతరులూ వినియోగించుకోవచ్చని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

### రైలు దిగి కార్యాలయంలోకే..

రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి సమీపంలోని మైండ్‌స్పేస్ ఐటీ పార్క్‌కు రహేజా సంస్థ స్కైవాక్ ఏర్పాటు చేసింది. ఇది ఐటీ ఉద్యోగులకు సౌకర్యంగా మారింది. బాలానగర్ స్టేషన్ నుంచి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫినిక్స్/ల్యాండ్ మార్క్ మాల్‌కు అనుసంధానంగా ఆ సంస్థ స్కైవాక్ అందుబాటులోకి తెచ్చింది.

### త్వరలో సాకారం..

ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ పక్కనే వాసవీ ఆనంద నిలయం పేరుతో భారీ గేటెడ్ కమ్యూనిటీ నిర్మిస్తున్నారు. తమ నివాస సముదాయానికి మెట్రో స్టేషన్ నుంచి ఆకాశ నడక మార్గం నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇదే విధంగా మరికొన్ని సంస్థలు నాగోల్, స్టేడియం, దుర్గం చెరువు, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ల నుంచి ఈ తరహా స్కైవాక్‌ల ఏర్పాటుకు తమతో చర్చలు జరుపుతున్నాయని ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో ఎండీ కేవీబీరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రైవేటు సంస్థలు ఎల్ అండ్ టీ మెట్రోరైలు స్టేషన్ రిటైల్ అధికారి కె.వి.నాగేంద్ర ప్రసాద్ 99000 93820 ను సంప్రదించవచ్చని సూచించారు.

Date : 04/03/2025 EditionName : GREATER HYDERABAD PageNo :